

తమిళనాడు వాసి భౌతిక కాయానికి అంత్యక్రియలు

- మిన్నంటిన బంధువుల రోధనలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ /హాస్పిటల్

తమిళనాడు రాష్ట్రానికి చెందిన ప్రశాంత్ (29) మతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కర్నూలు తహశీల్దార్ ఆంజనేయులు, పోలీసుల సమక్షంలో కర్నూలు హిందూస్మశాన వాటికలో ప్రశాంత్ మృతదేహానికి కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. తమిళనాడు నుంచి వచ్చిన ప్రశాంత్ కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. ఎవరూ ఓదార్చలేక పోయారు. చూపరులను సైతం కంటతడిపెట్టించింది. కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో మృతదేహాల అప్పగింత సోమవారం పూర్తయింది. ఆదివారం రాత్రికి 18 మంది మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించగా సోమవారం ఉదయం తమిళనాడు రాష్ట్రానికి చెందిన ప్రశాంత్ (29) మతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కర్నూలు తహశీల్దార్ ఆంజనేయులు, పోలీసుల సమక్షంలో కర్నూలు స్మశాన వాటికలో ప్రశాంత్ మృతదేహానికి కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. శుక్రవారం ప్రమాదం జరుగగా అదే రోజు అర్ధరాత్రి రెండు గంటల వరకు డాక్టర్లు 16 బృందాలుగా ఏర్పడి మృతదేహాలకు డిఎన్ఎ పరీక్షలు నిర్వహించారు. బంధువుల డిఎన్ఎ తీసుకుని అదే రోజు పరీక్ష నిమిత్తం మంగళగిరి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఆదివారం ఉదయం డిఎన్ఎ రిపోర్టులు రావడంతో మతదేహాలను బంధువులకు అప్పగించే కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. డిఎన్ఎ రిపోర్టుల మ్యాచింగ్ ప్రకారం మృతదేహాలను వారివారి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎన్ఐఆర్ కాపీ, డెత్ సర్టిఫికేట్, పోర్టుమార్టం నివేదికలను అప్పగించారు.



ప్రశాంత్ (ఫైల్)



మృతదేహం వద్ద రోధిస్తున్న మృతుని బంధువులు

హైవే ప్రయాణం భయం.. భయం..!

- చెట్ల మల్లాపురం వద్ద మూడు కార్లను ఢీకొన్న కంటైనర్
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన...
- త్రుటిలో తప్పిన ప్రాణ నష్టం..
- ఊపిరి పీల్చుకున్న అధికారులు, ప్రజలు
- బస్సు ప్రమాదం చోటే ఘటన..

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు చెట్లమల్లాపురం వద్ద జరిగిన ఘోరబస్సు ప్రమాదంలో 19 మంది సజీవ దహనం దుర్ఘటన మరువక ముందే మరోఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఈఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.... దీంతో రాకపోకలు స్థంబించి పోయాయి. అర్ధగంట పాటు హైవేలో ఆగిపోయిన బస్సులు, ఇతర వాహనదారులు కొద్దిసేపు ఆందోళనకు గురయ్యారు. మళ్లీ ఏదో జరిగిందని చర్చ జరుగుతుండగానే కార్లు మాత్రమే దెబ్బతిన్నాయి. ఎలాంటి ప్రాణహాని లేదని, స్వల్పగాయాలు మాత్రమే అయ్యాయనే సమాచారం రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అస్సలు ఆదివారం ఏం జరిగింది: ఓ కంటైనర్ వరుసగా మూడు కార్లను ఢీకొట్టింది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు ఓ కంటైనర్ ట్రక్కు వెళ్తోంది. కార్లతో ఉన్న కంటైనర్ కల్లూరు(మం) కొంగనపాడు ప్లై ఓవర్‌పై నుంచి వెళుతున్న క్రమంలో ఓ కారు కంటైనర్‌ను ఓవర్‌టేక్ చేసి ముందుకు వెళ్లింది. స్పీడ్ కంట్రోల్ చెయ్యలేక పోయిన కంటైనర్ డ్రైవర్ ముందుగా వెళ్తున్న వరుసగా మూడు కార్లను ఢీకొట్టాడు. చిన్నటేకూరు-చెట్ల మల్లాపురం ప్రాంతంలోకి రాగానే ఆ కంటైనర్ ముందు వెళ్తున్న మూడు కార్లను ఢీకొట్టింది. కంటైనర్ ఢీకొట్టడంతో మూడు కార్లు దెబ్బతిన్నాయి. దీంతో ఒక్కసారిగా అక్కడ ఆందోళనకర వాతావరణం నెలకొంది. ప్రమాదంలో మూడు కార్లు నుజ్జునుజ్జు అయ్యాయి. దీంతో ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. అయితే అదృష్ట వశాత్తు ఎవరికీ ప్రాణ హాని జరగలేదు. స్వల్పగాయాలతో అందరూ క్షేమంగా వెళ్లారు. మూడు కార్లు డ్యామేజ్ కావడంతో అటుగా వెళ్తున్న వారు స్థానికులు భయానికి గురయ్యారు. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని సమాచారం. చిన్నటేకూరు బస్సు ప్రమాదం జరిగిన ప్రాంతంలోనే మరో ప్రమాదం జరగడంతో అటుగా వెళ్తున్న వారు ఆ ప్రమాదాన్ని చూసి చర్చించుకుంటున్నారు. ఎవరికి ఏమి కాలేదనే సమాచారంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. రహదారులపై వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాలని అధికారులు కోరుతున్నారు. ప్రత్యేక క్రేన్ సహాయంలో పోలీసులు, రవాణా శాఖ అధికారులు ధ్వంసమైన కార్లను పక్కకు తొలగించారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఎప్పుడు ఏంజరుగుతుందోన హైవే ప్రయాణికులు భయపడుతున్నారు. హోంమంత్రి బస్సు ప్రమాద ఘటన పర్యవేక్షణకు వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రిలో మాట్లాడి పోలీసులు, రెవెన్యూ, రవాణా శాఖ అధికారుల సమక్షంలో హైపవర్ కమిటీ, లేదా కమిషన్ వేసి ప్రమాదాలను నివారిస్తామని చెప్పారు. అది త్వరగా వేసి ప్రయివేటు వాహనాల వేగనియంత్రణ, హైవే అధికారులు రోడ్డు వెంట రాత్రిపూట లైట్లు అమర్చడం, దూరం ప్రయాణం చేసే వాహనాల డ్రైవర్లు తీసుకోవల్సిన జాగ్రత్తలు త్వరగా తేల్చుతారని ఆశిద్దాం..... లేదంటే రోజుకో ఘటనతో ప్రయాణికులు అరచేతిలో ప్రాణం పెట్టుకుని బిక్కుబిక్కు మంటూ ప్రయాణం చేయాల్సిందే.



కారును ఢీకొన్న కంటైనర్



కంటైనర్ ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయిన కారు

టెట్ పాస్ అవ్వాల్సిందే..!

- ప్రభుత్వ ఉపాధ్యాయుల కూడా
- సుప్రీంకోర్టు ఉత్తర్వులతో విద్యాశాఖ కసరత్తు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నిర్వహణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పాఠశాల విద్యాశాఖ అడుగులు వేస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు కూడా టెట్ రాయాల్సిందేనని ఉత్తర్వులు ఇవ్వడం పట్ల ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు కూడా తప్పనిసరిగా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) అర్హత సాధించాలని సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తాజా తీర్పు ప్రకారం, రైట్ టు ఎడ్యుకేషన్ చట్టం అమలు పరిచిన తేదీకి ముందు ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులు (కొంతకాలంగా పనిచేస్తున్న వారు కూడా)- ఇంకా రిటైర్మెంట్‌కు ఐదు సంవత్సరాలకు మించి సేవా కాలం ఉన్నవారు, రెండు సంవత్సరాల్లోపూ తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణులు కావాలని ఆదేశించింది. ఐదు సంవత్సరాలకు తక్కువ సేవా కాలం మిగిలి ఉండే వారు టెట్ లేకుండా పని కొనసాగించొచ్చు కానీ ప్రమోషన్ కోసం టెట్ తప్పనిసరి అని పేర్కొంది. ? టెట్ ఉత్తీర్ణత సాధించలేక పోతే ఉద్యోగంలో నుంచి తొలగింపు జరగొచ్చు. ఉద్యోగం నష్టపోయినా, అప్పటివరకూ వచ్చిన పెన్షన్ లాభాలు చెల్లింపు ఉంటుంది. కొత్తగా ఉద్యోగం చేయాలనుకునే వారు టెట్ కోర్సు తప్పనిసరి. అలాగే ప్రైవేట్, ప్రభుత్వ టీచర్లు, అందరూ ఒకే ప్రమాణాల ప్రకారం పరీక్ష రాయాల్సి ఉంటుంది. జిల్లాలో ప్రభుత్వం ప్రయివేటు ఉపాధ్యాయులు దాదాపు 10 వేల మంది టెట్ పరీక్షలు రాయాల్సి ఉంది.

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు మండిపాటు

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. డిఎస్‌సి ద్వారా అర్హత సాధించి ఉద్యోగాల్లో చేరిన తమను ఇప్పుడు టెట్ పరీక్ష రాయాలని చెప్పడం సరైంది కాదు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే ఇన్సర్వీస్‌లో అన్న ఉపాధ్యాయులకు ఈ పరీక్ష నుండి మినహాయింపు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విన్నవించుకుంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ వేయాలి : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కూడా టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సమంజసం కాదు. ఈ తీర్పు పై రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ వేసి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఇన్ సర్వీస్ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలి

- బి.నవీన్ పాటి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలి. సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపైన రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ఈ పరీక్ష లేకుండా చేయాలి.

సంఘటిత పోరాటాలకు సిఐటియు సిద్ధం

- జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పిఎస్.రాధాకృష్ణ, ఎమ్‌డి.అంజిబాబు



రాధాకృష్ణ



అంజిబాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లాలో సంఘటిత కార్మిక వర్గ ఉద్యమ నిర్మాణానికి సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు 13వ జిల్లా మహాసభలు పిలుపు ఇచ్చినట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు తెలిపారు. ఈనెల 25, 26 తేదీలలో కర్నూలు నగరంలో కార్మిక కర్షక భవన్‌లో (రాజగోపాల్ ప్రాంగణం, మహానంది రెడ్డి నగర్)లో నిర్వహించిన మహాసభ వివరాలను కార్మిక కర్షక భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ జిల్లా కోశాధికారి ఎం.గోపాల్, జిల్లా కార్యదర్శి ఆర్.నరసింహులు మాట్లాడుతూ సిఐటియు జిల్లా మహాసభలో జిల్లా వ్యాప్తంగా వివిధ పట్టణాలకు మండలాలకు ప్రాతినిధ్యం వహిస్తూ 180 మంది ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు సిఐటియు రాష్ట్ర కేంద్రం నుండి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, ప్రతినిధులు జరిపే చర్చలను పర్యవేక్షించారు. కర్నూల్ జిల్లాలో గత మూడేళ్ల కాలంలో చేసిన ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్తులో చేపట్టవలసిన ఉద్యమ పోరాటాలను మహాసభలో రూపొందించుకున్నామన్నారు. ఈ మహాసభ సందర్భంగా 12 రకాల తీర్మానాలను ఆమోదించినట్లు వారు తెలిపారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగులో ఉన్న డిఎలను విడుదల చేయాలని, ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, కొత్తగా వస్తున్న పరిశ్రమలలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. జిల్లాలో పట్టణాలలో రోజురోజుకు పెరుగుతున్న షాపింగ్ మాల్స్‌లలో ప్రవేట్ నర్సింగ్‌హోమ్స్‌లో, ప్రైవేటు స్కూళ్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు కార్మిక చట్టాలను అమలు చేసి కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. స్కీం వర్కర్లకు ప్రభుత్వ పథకాలు అందే విధంగా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 13గంటల పని విధానాన్ని వాపస్ తీసుకొని 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని, రాత్రి షిఫ్టులో మహిళలను పని చేయించడాన్ని నిలుపుదల చేయాలని, పంచలింగాలలో రైల్వే వ్యాగన్ వర్క్ షాపు నిర్మాణాన్ని చేపట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. మెప్మా రంగంలో పనిచేస్తున్న ఆర్‌పిలపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఆటో కార్మికులలో అర్హులైన వారికి అందరికీ ఆర్థిక సహాయం అందించాలన్నారు. రవాణా రంగంలో అత్యంత ప్రమాదకరమైన 2019 మోటార్ వెహికల్ యాక్ట్‌ను ఉపసంహరించుకోవాలన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా నష్టపోతున్న డ్రైవర్ల అందరికీ నష్టపరిహారం చెల్లించాలని తదితర తీర్మానాలను మహాసభ ఆమోదించినట్లు తెలిపారు. రాబోయే కాలంలో ఈ తీర్మానాలు అమలు కోసం పోరాటాలు కొనసాగించాలని మహాసభ నిర్ణయించినట్లు తెలిపారు.

సిఐటియు జిల్లా నూతన కమిటీ ఎన్నిక

రాబోవు మూడు సంవత్సరాల కాలంలో సిఐటియు ఆధ్వర్యంలో జరిగే పోరాటాలను నాయకత్వం వహించడానికి అవసరమైన నూతన నాయకత్వాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన సిఐటియు జిల్లా అధ్యక్షులుగా పిఎస్.రాధాకృష్ణ, జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శిగా ఎండి.అంజిబాబు, జిల్లా ఉపాధ్యక్షులుగా డి.గౌసే దేశాయ్, బి రామాంజనేయులు, పి.నిర్మల, కెపి.నారాయణస్వామి, జె.దివాకర్, నాగేశ్వరరావు, జిల్లా కోశాధికారిగా ఎం.గోపాల్, జిల్లా కార్యదర్శులుగా ఎం. విజయ్,ఎస్.ఉమాదేవి, కె.ప్రభాకర్, ఆర్.నరసింహులు, పి.తిప్పన్న, కోటేశ్వరరావులను 60 మంది జిల్లా కమిటీ సభ్యులను 78 మంది జిల్లా కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.



జజిహెచ్‌లో కాఫీక్లబ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినర్సమ్మ

డాక్టర్స్ కాఫీ క్లబ్ ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓల్డ్ లెక్చరర్ గ్యాలరీలో వైద్యుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన డాక్టర్స్ కాఫీక్లబ్ ను ఆసుపత్రి సూపరిండెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ కాఫీ క్లబ్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరిండెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ క్లబ్ ద్వారా వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు రోజువారీ వైద్యసేవల నడుమ కొంత విశ్రాంతి తీసుకొని స్నేహపూర్వక వాతావరణంలో ఆలోచనలు పంచుకునేందుకు, అనుభవాలను చర్చించేందుకు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ డాక్టర్స్ కాఫీ క్లబ్ ద్వారా వైద్యులు విశ్రాంతి తీసుకుంటూ పరస్పర ఆలోచనలు పంచుకునేందుకు వేదిక వలే ఉందన్నారు. ఇది వైద్య సిబ్బందిలో సమిష్టి భావనను పెంపొందించి, రోగి సేవలకు మరింత శక్తిని అందిస్తుందని తెలిపారు. వైద్యుల కోసం అందమైన వాతావరణంలో కాఫీ క్లబ్ సదుపాయం ఏర్పాటు చేయడం పట్ల ఎపిజిడిఎ అసోసియేషన్ వైద్యులందరూ సంతోషం వ్యక్తం చేశారు. కెఎంసి వైస్ ప్రిన్సిపల్, డాక్టర్ సాయి సుధీర్ ఆసుపత్రి ఇంచార్జ్ సిఎస్ఆర్ఎంఒ, డాక్టర్ వెంకటరమణ, ఎపిజిడి అసోసియేషన్ ప్రెసిడెంట్, డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ విజయ్‌శంకర్, డాక్టర్ దామమ్ శ్రీనివాసులు, డాక్టర్ రామ్ శివనాయక్, డాక్టర్ రామకృష్ణ నాయక్, పీజీలు తదితరులు పాల్గొన్నారు.



చోరీ కేసులో ఇద్దరికీ రిమాండ్

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

బస్సులో రూ.25 లక్షలు చోరీ జరిగిన ఘటనలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ వహీద్, సుహేత్‌లను సోమవారం అరెస్టు చేసినట్లు సిఐ మధుసూదన్ రావు తెలిపారు. వారి ఇరువురి నుంచి రూ.25 లక్షల సొమ్మును రికవరీ చేశారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణమూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పదేపదే తిప్పించుకోవద్దు

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అర్జీ దారులను పదే పదే తిప్పించుకోవద్దని, గడువు లోపు సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజు లాగిన్ ఓపెన్ చేసి, అర్జీకి సంబంధించిన అర్జీ దారుతో ఓపిగ్గా మాట్లాడి, వివరాలు తెలుసుకొని పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు.. అర్జీకి సంబంధించి సరైన విధంగా, అర్థమయ్యేలా పూర్తి వివరాలతో ఎండార్స్‌మెంట్ తయారుచేసి అర్జీదారునికి వాట్సప్‌లో పంపించి, ఫోన్ చేసి చెప్పాలని సూచించారు.. రీఓపెన్, గడువు దాటిన తర్వాత పరిష్కారం ఉండకూడదన్నారు. పరిష్కరించలేని సమస్యలయితే అర్జీదారునికి వివరించి చెప్పాలన్నారు. ఆడిట్ ప్రక్రియ వంద శాతం చేయాలని, సిఎంఒ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డిఆర్ఒ వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు అనూరాధ, కొండయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇళ్లనిర్మాణాలు వేగవంతం చేయాలి

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం మండల స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏదైనా మండలంలో ఇళ్ళ నిర్మాణాలు సక్రమంగా జరగకుంటే, సంబంధిత మండలాలకు వెళ్లి పనులు ఎందుకు జరగడం లేదన్నారు. సమస్య ఏంటి అని పరిశీలించి, సమస్యను పరిష్కరించి పురోగతి తీసుకొని వచ్చే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆడిట్ పెండింగ్ ఎక్కువగా ఉందని, పెండింగులో ఉన్న ఆడిట్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు మున్సిపాలిటీలలో పారిశుధ్యం సరిగా లేదని చేస్తున్నందున, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నూరుల్‌కమర్, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

నేత్ర దానం చేసి ఇద్దరికి చూపునివ్వండి

-రెడ్‌క్రాస్ సొసైటీ , డాక్టర్ కెవిసుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ, డాక్టర్ భరత్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రతి ఒక్కరు నేత్రదానం చేయడం వల్ల ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చని డాక్టర్ కె వి సుబ్బారెడ్డి విద్యా సంస్థల ఎండి డాక్టర్ కె వి సుబ్బారెడ్డి అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, డాక్టర్ కెవి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ భరత్ హాస్పిటల్ కంటి సేవా విభాగం డాక్టర్ స్వాతి భరత హాస్పిటల్ సహకారంతో దిన్నే దేవరపాడు గ్రామంలో మారెమ్మ గుడి దగ్గర కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో 120 మంది చూపించుకోగా 30 మందికి ఆపరేషన్ అవసరమవుతుందిని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, 17వ వార్డు కార్పొరేటర్ కె. పద్మలతారెడ్డి, సర్పంచి కె మాధవస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ కేజీ గోవిందరెడ్డి మాట్లాడుతూ అనేక గ్రామాలలో కంటి ఆరోగ్యం, నేత్రదానంపైన ప్రజలలో అవగాహన కల్పిస్తున్నా మన్నారు. శుక్లాలు ఉన్న వారికి ఉచిత ఆపరేషన్లు భరత్ హాస్పిటల్ కంటి విభాగంలో చేయిస్తామని తెలిపారు. డాక్టర్ కెవి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ మారుమూల గ్రామాలలో ఎంతో మంది వృద్ధులు మహిళలు కంటికి సంబంధించిన జబ్బులతో బాధపడుతున్నారని, వారికి డాక్టర్ కెవి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ సహాయ సహకారాలతో ఆపరేషన్ అయిన తర్వాత ఉచిత కంటి అద్దాలు ఇస్తామని తెలిపారు. కంటి వైద్య శిబిరం ద్వారా అనేక మందికి కంటికి సంబంధించిన జబ్బులు ఆపరేషన్లు ప్రజలు ఉపయోగించుకోవాలని తెలిపారు. పద్మలతారెడ్డి మాట్లాడుతూ ఉచిత మందులు, రవాణా సౌకర్యాలు తమ వంతు సహాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మాజీ చైర్మన్ జి.శ్రీనివాస్ యాదవ్, కె మద్దయ్య, నాగరాజారావు, మహేశ్వర్‌రెడ్డి, ప్రకాష్, తిరుమల్ పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కెవిసుబ్బారెడ్డి, కెజి గోవిందరెడ్డి, పద్మలత



వినతులు స్వీకరిస్తున్న ఎస్‌పి

పోలీస్ గ్రీవెన్స్‌కు 135 ఫిర్యాదులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 135 ఫిర్యాదులు అందాయని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు పాల్గొన్నారు.



వన్ డిపో మేనేజర్‌కు సమస్యలు వివరిస్తున్న ఐద్వా నాయకులు

ఉచిత బస్సు సౌకర్యం పెంచాలి

- వన్ డిపో మేనేజర్‌కు ఐద్వా వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు బస్టాండులో రోజురోజుకు పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో వన్ డిపో మేనేజర్ కె.సుధారాణిని కలిసిసోమవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఐద్వా రాష్ట్ర నాయకులు ఎన్.అలివేలు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అరుణమ్మ, ఎస్.శ్యామల, న్యూ సిటీనగర అధ్యక్షురాలు కుమారి, ఓల్డ్ సిటీ కార్యదర్శి బి.పద్మ, సావిత్రి, పర్వీన్ పాల్గొన్నారు. కర్నూలు ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికుల ఉచిత బస్సులు అమల్లోకి రావడంతో ఆర్‌టిసి బస్టాండ్ నిత్యం ప్రయాణికులతో కలకలలాడుతుందన్నారు. పెరిగిన ప్రయాణికులకు అనుగుణంగా బస్టాండులో సౌకర్యాలు లేవని, మరుగుదొడ్లు సరైన నిర్వహణ లేక అధ్వానంగా ఉంటున్నాయన్నారు. మరుగుదొడ్లు సక్రమంగా శుభ్రపరచాలని, పెరిగిన ప్రయాణికులు అనుగుణంగా వాటి సంఖ్య కూడా పెంచాలన్నారు. సూపర్ లగ్జరీ బస్సులలో కూడా ఉచిత బస్సు పథకాన్ని వర్తింప చేయాలన్నారు. ఉదాహరణకు కర్నూలు నుండి విజయవాడకు వెళ్లాలంటే రెండు లేదా మూడు బస్సులు మారాల్సిన పరిస్థితి ఉందన్నారు. అందుకే సూపర్‌లగ్జరీలో మహిళలకు ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. పెరిగిన ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్య కూడా పెంచాలన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తక్షణమే స్పందించి కర్నూలు బస్టాండులో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చుక్కల భూములకు పరిష్కారం చూపండి

- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో ప్రయివేట్ భూములను కూడా చుక్కల భూములుగా, ప్రభుత్వ భూములుగా చూపిస్తూ రైతులను రెవెన్యూ వారంగా ఇబ్బందులు గురి చేస్తున్నారని, చుక్కల భూముల సమస్యను పరిష్కరించాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం పాలకుర్తి, తెర్నేకల్ గ్రామాల రైతులతో కలిసి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొనుగోలు భూములు, వారసత్వంగా వచ్చిన భూములను కూడా రెవెన్యూ అధికారులు చుక్కల భూములుగా చూపించడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నారని, ప్రభుత్వ రాయితీలను అందుకోలేకపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి చుక్కల భూముల నుంచి శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే రైతులతో కలిసి తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. వ్యకాస సీనియర్ నాయకులు యూసుఫ్ బాష, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, ప్రజాసంఘాల నాయకులు సుధాకర్, రవీంద్ర, లింగన్న, లోకయ్య, రైతులు ఏసోబు, చిట్టెమ్మ, లింగమయ్య, రామన్న, వెంకటేశులు, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణ పనులు చేపట్టాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి - కోసిగి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశులు

ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణ పనులు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో జరిగే పోరాటంలో పార్టీలకతీతంగా ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజాసంఘాల నాయకులు కలిసి రావాలని కోరారు. సోమవారం స్థానిక శ్రీసిద్ధారూఢ స్వామి ఆశ్రమంలో మండలానికి సాగు, తాగునీరు అందించి వలసలను నివారించాలని కోరుతూ సదస్సు నిర్వహించారు. సిపిఎం మండల నాయకులు వీరేష్ అధ్యక్షత వహించారు. సిపిఐ మండల నాయకులు గోపాల్, ఎఐవైఎఫ్ నాయకులు రాజు, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గప్ప, ఎంఆర్‌పిఎస్ మంత్రాలయం నియోజకవర్గ కన్వీనర్ నాగరాజు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కోసిగి మండలం అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉందని, ఇక్కడి రైతులకు సాగునీరు లేక కేవలం వర్షాధారంపైనే పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. కేవలం నాలుగు నెలలు మాత్రమే వ్యవసాయ పనులు ఉంటాయని, మిగతా రోజుల్లో బతకడానికి సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని చెప్పారు. సాగునీటికి అవకాశాలున్నప్పటికీ పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడంతో మండలం నిత్యం కరువు, కాటకాలకు గురవుతోందని విమర్శించారు. చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని దుద్ది, మూగలదొడ్డి, బెళగల్ గ్రామాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా పని చేయడం లేదన్నారు. పులికనుమ ప్రాజెక్టు ప్రత్యేక తూము ఏర్పాటు చేసి కోసిగి చుట్టుపక్కల గ్రామాలకు సాగు, తాగునీరు అందించాలని చాలా కాలంగా ఆందోళనలు చేస్తున్నా ప్రజలు, రైతుల సమస్యలు పాలకులకు, ప్రభుత్వానికి పట్టడం లేదని మండిపడ్డారు. ఈ ప్రాంత అభివృద్ధి, ప్రాజెక్టుల కోసం, సాగు, తాగునీటి కోసం జరిగే పోరాటంలో పార్టీలకతీతంగా అందరూ కలిసి రావాలని కోరారు. సిపిఎం మండల కన్వీనర్ రాముడు, నాగేంద్ర, గోపాల్, కెవిపిఎస్ నాయకులు జేజప్ప, రైతుసంఘం నాయకులు పూజారి శ్రీనివాసులు, కుంకుమ బొట్టు తాయన్న, ఆటో యూనియన్ నాయకులు వెంకటేశులు, చిన్నన్న పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి : వామపక్ష నాయకులు

ప్రజాశక్తి - దేవనకొండ


ఆందోళన చేస్తున్న వామపక్ష నాయకులు

అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మద్దిలేటి శెట్టి, రైతుసంఘం జిల్లా నాయకులు వై.రంగప్ప డిమాండ్ చేశారు. సోమవారం దేవనకొండ వ్యవసాయ, తహశీల్దార్ కార్యాలయం ముందు వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి ఎమ్.నరసారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు రూ.వేలకు వేలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి ఉల్లి, పత్తి, కంది, ఆముదం, టమోటా తదితర పంటలు సాగు చేశారని తెలిపారు. ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.90 వేల వరకు పెట్టుబడులు పెట్టారని చెప్పారు. మండలంలో కురిసిన అధిక వర్షాలతో రైతులు పూర్తిగా నష్టపోయారని తెలిపారు. రైతుల పంట పొలాలను వ్యవసాయ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి వారిని ఆదుకోవాలని కోరారు. రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై ఎఓ, తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి బజారి, నాయకులు రంగస్వామి, రామాంజి, తెర్నేకల్ సుధాకర్, రవీంద్ర, లోకయ్య, లింగన్న, భాస్కర్, దస్తగిరి, సుబ్బయ్య, యూనుస్, మనోహర్, శంకర్, మస్తాన్, వీరేష్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అజీమ్ ఖాన్

ప్రజాశక్తి - ఆదోని

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అజీమ్ ఖాన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర మహాసభల్లో తనను రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారని తెలిపారు. అజీమ్‌ఖాన్‌కు రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి ఇవ్వడం వల్ల ఫెడరేషన్ మరింత బలోపేతమవుతుందని ఉద్యోగులు తెలిపారు.

కౌతాళంలో భారీ వర్షం...

- తడిసి ముద్దయిన పత్తి

ప్రజాశక్తి - కౌతాళం


తడిసి ముద్దయిన పత్తి

మొంథా తుపాను నేపథ్యంలో కౌతాళం మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. వర్షం కురవడంతో పత్తి రైతుల కష్టాలు వర్ణణాతీతం. మూడు నెలల నుంచి వర్షాలకు వివిధ పంటలు దెబ్బతినడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ప్రస్తుతం పత్తి రైతుల చేతికొచ్చిన పంట వర్షం కారణంగా దెబ్బతినింది. భారీ వర్షం వల్ల పత్తి తడిసి ముద్దయింది.

పిడుగుపాటుకు 9 మేకలు మృతి



ఆలూరు : మండలంలోని హులేబీడు గ్రామ పొలాల్లో పిడుగు పడి తొమ్మిది మేకలు మతి చెందాయి. గ్రామంలోని మంగమ్మ, రాముడు దంపతులు గత 10 ఏళ్లుగా గొర్రెలు కాస్తూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం గాలి వర్షం కురవడంతో మేకలపై పిడుగు పడి రూ.1.50 లక్షల విలువ చేసే తొమ్మిది మేకలు మృతి చెందాయి. గొర్రెల కాపరులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అంగన్వాడీ గుడ్ల అక్రమ రవాణా..!

ప్రజాశక్తి - ఆస్పరి

గర్భిణులకు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం సరఫరా చేస్తున్న కోడిగుడ్లు అధికారుల చేతివాటం వల్ల అక్రమ రవాణాకు గురవుతున్నాయి. ఆస్పరిలో కోడిగుడ్లను గోడౌన్‌లో ఉంచి సరఫరా చేసేందుకు ప్రభుత్వం కాంట్రాక్టర్లకు అప్పగించింది. గోడౌన్ నుంచి సరఫరా చేసే కోడిగుడ్లపై రంగుల గుర్తులు వేసి సరఫరా చేయాలి. అలా చేస్తే అడ్డదారిలో వెళ్లకుండా కట్టడి చేయడానికి అవకాశం ఉంటుంది. అక్రమంగా అమ్మేందుకు అవకాశం లేకపోవడంతో కోడిగుడ్లపై రంగులు లేకుండా యథావిధంగా టాటా ఏస్ వాహనాల్లో గ్రామాలకు తరలిస్తున్నారు. సోమవారం ఆస్పరి బస్టాండ్‌లో రంగులు లేకుండా కోడి గుడ్లను టాటా ఏస్‌లో గ్రామాలకు తరలిస్తుండగా ప్రజాశక్తి కంటపడింది. పిల్లలకు అందాల్సిన కోడిగుడ్లు ఐసిడిఎస్ అధికారుల చేతివాటం కారణంగా అక్రమ రవాణాకు గురవుతున్నాయి.


గుర్తుల్లేని కోడిగుడ్లను సరఫరా చేస్తున్న దృశ్యం

మేల్కొన్న ఆర్‌టిఒ అధికారులు

- రెండు బస్సులు సీజ్

ప్రజాశక్తి - ఆదోని

ఎట్టకేలకు ఆర్‌టిఒ అధికారులు మేల్కొన్నారు. భద్రత సౌకర్యాలు లేని రెండు బస్సులను సీజ్ చేశారు. ఆదివారం రాత్రి పట్టణంలో ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. ప్రయివేట్ బస్సుల్లోని భద్రత ఏర్పాట్లను (సేఫ్టీ మెజర్స్) పరిశీలించారు. ఆదోని వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి మాట్లాడుతూ... ప్రయివేట్ వాహనాల్లో సరైన భద్రత చర్యలు, జాగ్రత్తలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అగ్నిమాపక యంత్రాలు, అత్యవసర నిష్క్రమణ ద్వారాలు, ప్రథమ చికిత్స కిట్ వంటి కీలకమైన భద్రత వసతులు లేని రెండు వాహనాలను గుర్తించామని తెలిపారు. నిబంధనలు పాటించని కెఎ 20 ఎసి 4974, ఎఆర్ 11ఎ 4999 నెంబర్లు గల రెండు ప్రయివేటు బస్సులను సీజ్ చేసినట్లు చెప్పారు.



అధికారులు సీజ్ చేసిన బస్సు

సిఎం రిలీఫ్ ఫండ్ పేదల వరం

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఆర్థిక స్తోమత లేని పేద రోగులకు సిఎం రిలీఫ్ ఫండ్ వరంలాంటిదని టిడిపి ఇన్‌ఛార్జీ కె.మీనాక్షి నాయుడు తెలిపారు. సోమవారం ఆయన నివాసంలో 16 మంది లబ్ధిదారులకు రూ.7,77,422 విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్యశ్రీ వర్తించని జబ్బులకు చికిత్సలు పొంది సహాయం అందించాలని దరఖాస్తు చేసుకున్న వారందరికీ చెక్కులు అందజేసినట్లు తెలిపారు. లబ్ధిదారుల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, బసాపురం రామస్వామి, రాష్ట్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ రామకృష్ణ, మండల అధ్యక్షులు శివప్ప, ఈరన్న, విరుపాక్షి, అల్తాఫ్, ఆరిఫ్, నాగరాజు, వెంకటేష్, రంగన్న, లక్ష్మన్న, మల్లికార్జున, రియాజ్ ఉన్నారు.


చెక్కులు అందజేస్తున్న మీనాక్షి నాయుడు

కార్యకర్తలకు అండగా సంక్షేమ నిధి : టిడిపి

ప్రజాశక్తి- దేవనకొండ

ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబాలకు టిడిపి సంక్షేమ నిధి కార్యకర్తలకు అండగా ఉందని టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, టిడిపి సీనియర్ నాయకులు ఉచ్చీరప్ప తెలిపారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో మండలంలోని లక్కందిన్నె గ్రామానికి చెందిన కురువ నాగన్న కుటుంబానికి టిడిపి మంజూరు చేసిన రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత నాలుగు నెలల క్రితం కురువ తిప్పక్క భర్త నాగన్న ప్రమాదవశాత్తు మృతి చెందారని తెలిపారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి సూచన మేరకు సంబంధిత ధ్రువపత్రాలను టిడిపి కేంద్ర కార్యాలయంలో సమర్పించారని చెప్పారు. వారికి కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి రూ.5 లక్షలు వారి కుమారుడు కురవ దర్గయ్య ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. టిడిపి నాయకులు రాజశేఖర్ గౌడ్, మల్లెపల్లి రంగడు, నాగేష్ గౌడ్, కురువ శేషన్న, మద్దిలేటి, మారెప్ప, మద్దిలేటి ఆచారి, బండపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

భౌతిక దాడులకు పాల్పడితే కేసులే : ఎమ్మెల్యే


ప్రజాశక్తి - ఆదోని

పాత కక్షలు మనస్పర్థల నేపథ్యంలో భౌతిక దాడులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే పార్థసారథి హెచ్చరించారు. పట్టణంలోని శుక్రవారం పేటలో టిడిపి, వైసిపి కార్యకర్తలు దాడులకు పాల్పడి చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే పార్థసారథి సోమవారం టిడిపి కార్యకర్తలను పరామర్శించారు. టిడిపి శ్రీరాములు, వైసిపి దుర్గప్ప గ్రూపు ఒకరిపై ఒకరు దాడులు చేసుకొని గాయాలతో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఏమైనా సమస్య ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని, దాడులు చేసుకోవడం మంచి పద్ధతి కాదని తెలిపారు. ఇరువురిపై కేసులు నమోదు చేయించి భౌతిక దాడులు ప్రోత్సహించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని పోలీసులను కోరారు.


పిపిపి విధానాన్ని వ్యతిరేకిస్తూ... వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - చిప్పగిరి

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చిప్పగిరి, కుందనకుర్తి గ్రామంలో ఎమ్మెల్యే బి.విరుపాక్షి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం విద్య, వైద్యాన్ని వ్యాపారం చేస్తోందని, ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరిస్తూ పేదలకు వైద్యం అందకుండా చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. పిపిపి విధానాన్ని రద్దు చేసేందుకు వైసిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకే కోటి సంతకాల సేకరణ చేపట్టినట్లు చెప్పారు. వైసిపి సీనియర్ నాయకులు, మాజీ సర్పంచి సురేష్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు సర్వర్ ఖాన్, చెరువు తిమ్మప్ప, కొండ శేఖర్ పాల్గొన్నారు. **నందవరం** మండలం గురజాల, రాయచోటి గ్రామాల్లో సంతకాల సేకరణ, రచ్చబండ నిర్వహించారు. వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక, బుట్టా నీలకంఠప్ప, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, వైసిపి నాయకులు మురహరి రెడ్డి, యువ నాయకులు ఎర్రకోట రాజీవ్ రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు శివారెడ్డి గౌడ్, మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి కెఆర్.లక్ష్మీకాంత్ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరుపాక్షి రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు కెఆర్.రామకోటేశ్వర్ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగ అధికార ప్రతినిధి గడ్డం నారాయణరెడ్డి, ప్రకాష్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, చాంద్ బాషా, కోటేశ్వరరావు, వెంకటేష్, ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. **కౌతాళం** మండలం కుంబాలనూరులో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి, వై.ధరణీ రెడ్డి, వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు వైసిపి మండల కమిటీ సభ్యులు జి.రామస్వామి ఆధ్వర్యంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ చేపట్టారు. వైసిపి నాయకులు ఎం.ఈరన్న, శివారెడ్డి, చెన్న బసవ, శివ, ఎల్లప్ప, సిద్ధప్ప, వాకిలి వీరేష్, హెచ్.శంకరప్ప, మాదేవప్ప, శివలింగప్ప, కిచిడి మాదేవా, కిచిడి రామలింగ, వెంకటేష్, గోవిందు, లింగమూర్తి, వీరేష్ పాల్గొన్నారు.


చిప్పగిరిలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు


నందవరంలో సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు


కౌతాళం

అర్ధరాత్రి తాగునీటి సరఫరా

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని 14వ వార్డు తాయమ్మ కాలనీ, అభి ముబారక్ నగర్, దోబీ ఘాట్ ప్రాంతాల్లో అర్ధరాత్రి తాగునీరు సరఫరా చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం నాయకులు తెలిపారు. సోమవారం సిపిఎం పాదయాత్ర సందర్భంగా సిపిఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి పి.గోవిందు, సిపిఎం పట్టణ నాయకులు లక్ష్మీ నరసయ్య, రమేష్, అబ్దుల్లా పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 14, 15వ వార్డుల్లో అర్ధరాత్రి తాగునీరు సరఫరా చేయడం అన్యాయమని మున్సిపల్ అధికారుల తీరును దుయ్యబట్టారు. గత 40 ఏళ్ల క్రితం తాయమ్మ కాలనీ, అభి ముబారక్ నగర్, దోబీ ఘాట్, సున్నం బట్టి ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్ వేశారని తెలిపారు. ఈ ప్రాంతానికి తాగునీటి పైపులైన్ వేసి ఉదయం పూట తాగునీరు అందిస్తామని గత ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు, ప్రస్తుత ఎమ్మెల్యే హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి 16 నెలలైనా తాగునీటి పైపులైన్ నిర్మాణం జరగలేదని తెలిపారు. రోడ్లు, డ్రెయినేజీ పరిస్థితి అధ్వానంగా ఉందని విమర్శించారు. పట్టణంలోని మురుగునీరు ఈ ప్రాంతంలో ప్రవహించడం వల్ల దుర్వాసనతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. చంద్రయ్య కొట్టాల ఆంజనేయ స్వామి గుడి నుంచి గూడూరు బైపాస్ రోడ్డు వరకు రోడ్డు నిర్మిస్తే కటిక పేట, ఎస్సీ కాలనీ, కబరిస్థాన్ కొట్టాల, చంద్రయ్య కొట్టాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. ఆంజనేయ స్వామి గుడి ముందున్న సాకిరేవు వంకపై వంతెన (కల్వర్ట్) నిర్మించాలని డిమాండ్ చేశారు. మురుగునీరు ప్రవహించే ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కాలనీల్లో తాగునీటి పైపులైన్, రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని, మున్సిపల్ అధికారులు, ఎమ్మెల్యే బీవీ జోక్యం చేసుకుని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 30న మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నామాల రాముడు, తెలుగు మాదన్న, వలీ బాష, ఆచారి, సుభాన్, ఖాజా, స్థానికులు పాల్గొన్నారు.



వార్డులో పర్యటిస్తున్న నాయకులు

కూలిన పశువైద్యశాల...

ప్రజాశక్తి -ఆలూరు

మండలంలోని మనేకుర్తి గ్రామంలోని పశు వైద్యశాల పైకప్పు ఆదివారం రాత్రి కూలింది. రాత్రి కూలడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదమూ జరగలేదు. మనేకుర్తి పంచాయతీ పరిధిలోని మూడు గ్రామాల పశువులకు వైద్యం అందించే పశువైద్యశాల గత కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరిందని మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, నూతన పశువైద్యశాలను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తత అవసరం'

ప్రజాశక్తి - గోనెగండ్ల

మొంథా తుపాను నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఎఇ సుధాకర్ రావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. తుపాను నేపథ్యంలో వీచే ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగిపడిపోయే ప్రమాదం ఉందని, వాటిని ముట్టుకోవద్దని సూచించారు. వర్షం కురిసే సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర ఉండరాదని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు తలెత్తితే విద్యుత్ ఉద్యోగులకు సమాచారం అందించాలని కోరారు.

'నేడు పత్తి రైతుల జిల్లా సదస్సు'

ప్రజాశక్తి - కౌతాళం

ఆదోని మార్కెట్ యార్డులో మంగళవారం జరిగే పత్తి రైతుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, మండల కార్యదర్శి ఈరన్న కోరారు. సోమవారం కౌతాళం, బదినేహాలు, కుంటనహాలు, ఉప్పరహాలు, రౌడూరు గ్రామాల్లో తిరిగి రైతులను చైతన పరుస్తూ సదస్సుకు రైతులను ఆహ్వానించారు. సదస్సుకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటేశులు, జి.రామకృష్ణ హాజరవుతున్నట్లు తెలిపారు.

త్వరలో పత్తి కొనుగోలు ప్రారంభం : ఎఒ

ప్రజాశక్తి - కోసిగి

త్వరలో సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు ప్రారంభమవుతాయని ఎఒ వరప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయ కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు పంట నమోదు చేసుకున్న తర్వాత రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదిస్తే నమోదు చేస్తారని, తర్వాత రైతులు ఆండ్రాయిడ్ ఫోన్‌లో అమ్మకపు తేదీ కోసం స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు. స్లాట్ బుకింగ్ అనంతరం సంబంధిత జిన్నింగ్ మిల్లు పేరు, ఊరు అందులో ఉంటుందన్నారు. పత్తిని జిన్నింగ్ మిల్లు దగ్గరకు తీసుకెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. రైతులు రిజిస్ట్రేషన్ కోసం సంబంధిత రైతు సేవ కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. పత్తిలో తేమశాతం, నాణ్యత సిసిఐ మార్గదర్శకాల మేరకు ఉంటే గరిష్ట ధర రూ.8,110 వరకు రైతులు పత్తిని అమ్ముకోవచ్చని తెలిపారు.

'విద్యార్థి బస్సు సమయానికి నడపాలి'

ప్రజాశక్తి - హోళగుంద : మండలంలోని సులువాయి గ్రామానికి విద్యార్థి బస్సును సమయానికి నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకులు నాగరాజు కోరారు. సోమవారం విద్యార్థులతో కలిసి ఆర్‌టిసి కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ... సులువాయి, పెద్దహేట, మూగమనగుంది, సమతగేరి గ్రామాల నుంచి దాదాపు 100 మంది విద్యార్థులు హోళగుందకు వస్తున్నారని తెలిపారు. బస్సుల ఆలస్యంతో తమకు ఆబ్సెంట్ పడుతుందని, ఆబ్సెంట్ పడితే హాజరు తక్కువ ఉందని హాల్ టికెట్లు ఇవ్వక పరీక్షలకు కూడా కూర్చోబెట్టడం లేదని విద్యార్థులు తెలిపారు. సాయంత్రం కూడా ఇంటికి వెళ్లేసరికి రాత్రి 7 గంటలు అవుతోందని చెప్పారు. పాఠశాల, కళాశాల సమయానికి అనుకూలంగా బస్సులు నడపాలని కోరారు.

మోటార్‌కు మరమ్మతులు చేయించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆదోని



అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని మండలం గనేకల్లులో పంచాయతీ మోటార్‌కు మరమ్మతులు చేయించాలని సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు వీరారెడ్డి కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వీరారెడ్డి, డివైఎఫ్ఐ మండల కన్వీనర్ బీసీ.వీరేష్ మాట్లాడారు. గ్రామంలో పంచాయతీ మోటార్ మరమ్మతులకు గురి కావడంతో దాదాపు 8 నెలలుగా నీరు రాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనేకసార్లు ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. వచ్చే నెలలో గ్రామ దేవత బంగారమ్మ అవ్వ దేవాలయం ప్రారంభోత్సవం ఉందని, ఇళ్లు శుభ్రం చేసుకోవాలంటే నీరు ఎక్కువ అవసరమవుతాయని తెలిపారు. శ్మశాన వాటికకు ప్రత్యేక దారి గుంతల మయంగా ఉందని, మట్టి వేయాలని, గ్రామంలో వీధిలైట్ల సమస్య ఉందని, పరిష్కరించాలని కోరారు.

ఎస్ఐ తిమ్మారెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - నందవరం


ఎస్ఐని కలిసిన ధనుంజయరెడ్డి

నందవరం ఎస్ఐగా తిమ్మారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నందవరం ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కేశవ్ కొద్ది రోజుల క్రితం అనంతపురం పిటిసికి బదిలీ అయ్యారు. ఎస్ఐ తిమ్మారెడ్డి మాట్లాడుతూ... తాను కర్నూలు వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు నిర్వహించానని, బదిలీ నిమిత్తం నందవరం స్టేషన్‌కు వచ్చినట్లు తెలిపారు. మండలంలో శాంతిభద్రతలు కాపాడడానికి కృషి చేస్తానని, సాధారణ ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తానని చెప్పారు. ఎస్ఐ తిమ్మారెడ్డిని టిడిపి యువ నాయకులు ధనుంజయ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటాం

- వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

వైసిపి నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. సోమవారం కర్ణాటక రాష్ట్రం రాయచూరులో వేర్వేరు సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వైసిపి నాయకుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైసిపి నాయకులు శివకుమార్ కుమారుడు సంపత్ కుమార్‌ను, మైనారిటీ సెల్ జిల్లా సెక్రటరీ అమీన్ బాష తల్లి మహబూబ్‌బీని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, కోసిగి మండల ఇన్‌ఛార్జీ మురళీ మోహన్ రెడ్డి ఉన్నారు.


పరామర్శిస్తున్న ప్రదీప్ రెడ్డి

బొలెరో ఢీకొని మహిళ మృతి

- వరుస మరణాలతో కుటుంబం ఛిద్రం

ప్రజాశక్తి - నందవరం

హాలహర్వి హైవేపైన బొలెరో వాహనం ఢీకొని మహిళ మృతి చెందారు. గ్రామస్తుల వివరాల మేరకు... కీర్తిశేషులు గవ్వల పెద్ద దేవ సహాయం భార్య రత్నమ్మ (65) సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుండగా బొలెరో వాహనం అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. ఆ వాహనం మంత్రాలయం వైపు వెళ్లేందుకు ఎమ్మిగనూరు నుంచి వచ్చింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ పరారయినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి గురైన రత్నమ్మను ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించామని చెప్పారు. చికిత్స పొందుతూ కోలుకోలేక ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఆమె మరణం గ్రామస్తులను దిగ్భ్రాంతికి గురి చేసింది. గ్రామంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి.


రత్నమ్మ (ఫైల్)

వరుస మరణాలతో కుటుంబం ఛిద్రం : కుటుంబంలో సంభవిస్తున్న వరుస మరణాలతో కుటుంబం ఛిద్రమైంది. పెద్ద దేవసహాయం రత్నమ్మకు ముగ్గురు సంతానం. సంవత్సరం క్రితం రత్నమ్మ భర్త మృతి చెందారు. అనంతరం రెండో కుమారుడు అనారోగ్యానికి గురై మృతి చెందారు. ఇప్పుడు రత్నమ్మ మరణించారు. సంవత్సర కాలంలో కుటుంబంలో ముగ్గురు మరణించారు. రెండో కుమారునికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. చిన్న కుమారునికి వివాహం కాలేదు. కుటుంబానికి పెద్దదిక్కయిన రత్నమ్మ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



సారా తయారీ ఆపేసిన వారికి చెక్కును అందజేస్తున్న కలెక్టర్ , ఎక్సైజ్ అధికారి

సారా రహిత జిల్లాగా కర్నూలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నవోదయం 2.0 ద్వారా కర్నూలు జిల్లాను సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0 లో భాగంగా కర్నూలు నగరం బంగారు పేటకు చెందిన నాటు సారా తయారీని మానుకున్న కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధుల కల్పనలో భాగంగా ఆటోలను, రూ.20 లక్షల రుణాలకు సంబంధించిన మెగా చెక్ ను జిల్లా కలెక్టర్ అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంత రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణా రెడ్డి, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ చంద్రహాస్, మెప్మా పిడి జి. శ్రీనివాసులు, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ శృతి, ఎల్‌డిఎం రామచంద్రరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాద మృతులకు అశ్రునివాళి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబాల పట్ల మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తూ ప్రమాదం జరిగిన ప్రదేశంలో బస్సు వద్ద కొవ్వొత్తులు వెలిగించి ఘన నివాళి సమర్పించారు. మానవత విపత్కర పరిస్థితిలో సహాయం అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని బస్సు దుర్ఘటనలో కూడా ఫ్రీజర్ బాక్సులు, శాంతిరథాలను ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ పిలుపు మేరకు సిద్ధంగా ఉంచారు. ఈ కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ మనోహర్ రెడ్డి, యాని ప్రతాప్, స్పందన సురేష్, ప్రతాప్, అపర్ణ, మంజుల, లక్ష్మీసాంబ, ఆర్ఎస్‌డిఎస్ ఫౌండర్ విజయుడు, పోలీసు లక్ష్మి, మాధవిలత, భవాని, సరోజ, సులోచనమ్మ సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

సి బెళగల్ మండలంలో అవీ - ఇవీ తెలుసుకొందాం

ప్రజాశక్తి-సి బెళగల్ : తహసీల్దార్ వెంకటలక్ష్మి స్పందన చేపట్టి నాలుగు వినతులు స్వీకరించారు. రైతుల ఆన్‌లైన్ పరిష్కరిస్తామని పేర్కొన్నారు. మొంథాన్ తుఫాన్ పై ఏఓ మల్లేష్ కుమార్ అప్రమత్తం చేశారు. ఇక్కడే పొలాలకు వెళ్లొదని, ధాన్యాలకు తర్పాళ్ళు కప్పుకోవాలని సూచించారు. 1857 నుండి 1947 మధ్యలో జాతియోధ్యమం, క్విట్ ఇండియాపై క్విజ్ పోటీలో గురుకుల విద్యార్థులు అరవింద్, విజయక్రాంతి ప్రతిభను చాటారు. ప్రిన్సిపల్ చింతలయ్య, సిబ్బందిఅభినందించారు. జిబిఎల్ – యూకే ట్రస్టు చేపట్టిన విద్య, వైద్య ఆరోగ్య శిబిరాలలో భాగంగా 2000 మంది విద్యార్థులకు సేవలు అందించడం అనందంగా ఉందని ట్రష్టు వ్యవస్థాపకులు చంద్రశేఖర్ యాదవ్ పేర్కొన్నారు.



వార్డులలో సమస్యలను పరిష్కరించాలి

-కమిషనర్ కు వినతి పత్రం ఇచ్చిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్ లో ఈరోజు జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి విశ్వనాథ్‌కు వార్డులలో ఉన్న సమస్యల పరిష్కరించాలని సిపిఎం నాయకులు వినతి పత్రాలు ఇచ్చారు. సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప నగర కమిటీ సభ్యులు బికే రామకృష్ణ ,కల్లూరు కార్యదర్శి జె. శ్రీనివాసులు మాట్లాడుతూ 32 వ వార్డులో హంద్రీ నది వెంట ముజఫర్ నగర్ ఐఎంఎల్ డిపో నుండి కల్లూరు హంద్రీ బ్రిడ్జి వరకు మురుగు కాలువ నిర్మించాలని , సిసి రోడ్లు వేయాలన్నారు. గంగావతి నగర్‌లో హంద్రీ నదికి వచ్చిన వరద వల్ల కూలిపోయిన మరుగుదొడ్డి బాగు చేయాలన్నారు. 33వ వార్డులో స్మశాన వాటిక పూర్తిగా కంపచెట్లతో నిండి చనిపోయిన శవాలను ఎక్కడ దహనం చేయాలో తెలియని పరిస్థితి ఉందని, స్మశాన వాటికలో వెంటనే కంప చెట్లు తొలగించి కాంపౌండ్ వాల్ నిర్మించి వీధిలైట్లు వేయాలని కోరారు. 35వ వార్డులో ఫారుక్ నగర్ ఉమామహేశ్వరి నగర్ లో రోడ్లు కాలువలు లేని కారణంగా వర్షం వచ్చిందంటే రోడ్లు బురదగా మారి ఇళ్లల్లోకి వెళ్లే పరిస్థితి లేదని అందుకు ఫరూఖ్‌నగర్ ఉమామహేశ్వరి నగర్ లో సిసి రోడ్లు కాలువలు వేయాలని తెలిపారు

మన ఉత్తరం మళ్లీ రాద్దాం

-తపాలా శాఖ ఆధ్వర్యంలో పోటీలు
- వయోపరిమితి లేకుండా అందరూ అర్హులే
- డిసెంబర్ 8 వరకు గడువు
-విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పోటీలలో పాల్గొనేలా విద్యార్థులను ఆయా పాఠశాలల యాజమాన్యాలు ప్రోత్సహించాలి. తపాలా శాఖ ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వాములు కావాలి. కర్నూలు పోస్టల్ సూపరింటెండెంట్ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ చరవాణి వచ్చిన తర్వాత పోస్ట్ కార్డులు కనుమరుగయ్యాయి. ఉత్తరం అంటే పోస్ట్ కార్డు గురించి నేటి తరం విద్యార్థులకు తెలియదంటే అతిశయోక్తి కాదు. మారిన కాలానుగుణంగా అప్‌గ్రేడ్ అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో తపాలా సేవలు ఆ కాలం నాటి పోస్ట్ కార్డులు, ఇన్‌ల్యాండ్ లెటర్లు, ఎన్వలప్ కవర్లను గురించి విద్యార్థులకు ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతో ఏటా సరికొత్త అంశంతో పోస్టల్ శాఖ పోటీలు నిర్వహిస్తుందన్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది లెటర్ టు మైరోల్ మోడల్ అంశంపై లేఖలను ఆహ్వానిస్తుందన్నారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో థాయ్‌ఆకర్ పేరుతో ఈ పోటీలో జరుగుతుందన్నారు. ఆధునిక కాలంలో ఉత్తరాలు రాసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కేవలం సామాజిక మాధ్యమాల ద్వారా మాత్రమే సమాచారం పంపుకుంటున్నారన్నారు. అందుకే ఉత్తరాన్ని గుర్తు చేద్దామని తపాలా శాఖ నిర్ణయించిందన్నారు. దీనిలో భాగంగా ప్రియమైన నువ్వు ఓ ఉత్తరం పంపు అంటూ ప్రోత్సహిస్తూ పోటీలు పెడుతుంది.



బహుమతులు: విభాగల వారిగా రాష్ట్ర జాతీయ స్థాయిలో విజేతలకు ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయిలో ఒక్కో విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి 12 మందికి మించకుండా నగదు బహుమతి అందజేస్తారన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు వరుసగా రూ 25 వేలు, రూ 10 వేలు, రూ 5 వేలు చొప్పున అందిస్తారన్నారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారికి జాతీయ స్థాయిలోకి పంపుతామన్నారు. జాతీయస్థాయిలో విజేతలకు ప్రథమ స్థానానికి రూ 50 వేలు, ద్వితీయ స్థానానికి రూ 25 వేలు, తృతీయ స్థానానికి రూ 10 వేలు ప్రదానం చేస్తారన్నారు.

అర్హులు ఎవరంటే: ఉత్తరం రాసేవారు భారత పౌరులై ఉండాలి. వయోపరిమితి లేదు. 18 ఏళ్ల లోపు ఒక కేటగిరి, 18 ఏళ్ల పైబడిన వారికి మరొక కేటగిరీగా విభజించారు. తెలుగు, హిందీ, ఆంగ్లం భాషలలో వ్యాసం రాయవచ్చు. చేతితో రాసిన వ్యాసాన్ని మాత్రమే అనుమతిస్తారు. ఎన్వలప్ కవర్ అయితే 1000 పదాలకు మించకుండా రాయాల్సి ఉంటుంది. వీటిని దిసూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్, కర్నూలు డివిజన్, కర్నూలు –518001. చిరునామాకు లేదా సమీపంలోని తపాలా కార్యాలయాలకు డిసెంబర్ 8లోగా పంపాలని తెలిపారు.

ఆయుధాల పట్ల అవగాహన అవసరం

-కర్నూలు ఎస్‌పి విక్రాంత్ పాటిల్
-రెండో రోజు కొనసాగిన ఆయుధాల ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పోలీసు విధుల్లో వినియోగించే ఆయుధాలు, సాధనాల పట్ల విద్యార్థి దశ నుండే అవగాహన కల్గి ఉండటం మంచిదని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా ప్రతి ఏటా అమరవీరుల పోలీసులను స్మరించుకుంటూ నిర్వహించే ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో ఏర్పాటు చేశారు. సోమవారం ఎస్‌పి ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన ఈ కార్యక్రమం ముఖ్యంగా ప్రజల్లో పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంపొందించడం, పోలీసుల కష్టసాధ్యమైన విధులను వివరించడమే లక్ష్యంగా నిర్వహించామన్నారు. పోలీసులు తమ నిత్య జీవితంలో ఎదుర్కొనే సవాళ్లను . వారు ఉపయోగించే ఆయుధాలను నేరుగా చూడగలిగే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు కల్పించామన్నారు. ప్రతీ విభాగం తీరుపై అవగాహన కలిగించడం ద్వారా విద్యార్థుల్లో సమాజ సేవపట్ల ఆసక్తి పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఎఆర్ సిబ్బంది ఆయుధాల వివరాలను తెలియజేస్తున్నారన్నారు. ఆయుధాల వినియోగ విధానాలు, ఎలాంటి సందర్భంలో ఎలాంటి ఆయుధం వాడవలసి ఉంటుందో, ఆ ఆయుధం ఎలా పనిచేస్తుందో సిబ్బంది తెలిపారన్నారు. ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణమోహన్ , ఆర్ఐలు పోతలరాజు, జావేద్ , నారాయణ, ఆర్ఎస్ఐ లు, పోలీసు సిబ్బంది , కర్నూలు నగరంలోని మాంటిస్సోరి స్కూల్ , శ్రీలక్ష్మీ స్కూల్, చైతన్య స్కూల్ విద్యాసంస్థలకు సంబంధించిన విద్యార్థులు పాల్గొన్నారు.



ఆయుధాల ప్రదర్శనను తిలకలిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

మొంథా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మొంథా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ఎ సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాతో పాటు నెల్లూరు, తిరుపతి జిల్లాలకు అవసరమైనపుడు వివిధ శాఖలకు సంబంధించి మెన్ , మెటీరియల్ ను పంపించేందుకు తీసుకుంటున్న చర్యలపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో ఒక మోస్తరుగా , రేపు, ఎల్లుండి భారీగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వరద ప్రభావిత జిల్లాలైన నెల్లూరు, తిరుపతి జిల్లాలకు అవసరమైన సమయంలో మెన్ , మెటీరియల్ పంపేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ విద్యుత్ శాఖ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ ఎస్ఇలను ఆదేశించారు.



విద్యుత్ శాఖకు సంబంధించి పోల్స్, మ్యాన్‌పవర్, ఎలక్ట్రిక్ మెటీరియల్ పంపేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ విద్యుత్ శాఖ ఎస్ఇని ఆదేశించారు..జిల్లాలో వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల భవనాలు శిధిలావస్థకు చేరినట్లయితే వెంటనే ఖాళీ చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, ఆర్ అండ్ బి ఎస్ఇ మహేశ్వర్ రెడ్డి, జిల్లా పరిషత్ సిఇఓ నాసర రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఇ బాలచంద్రారెడ్డి , హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ పాండురంగయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ మనోహర్, డిపిఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



30న కర్నూలులో జాబ్ మేళా

ఈనెల 30న కర్నూల్ నగరంలోని సాయికృష్ణ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. సోమవారం ఉద్యోగ జాబ్‌మేళాకు సంబంధించిన గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నైపుణ్య అభివృద్ధి , శిక్షణ శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాలో భాగంగా వివిధ రకాలైన 14 ప్రైవేటు కంపెనీలలో ఉన్న 750 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, నైపుణ్య అభివృద్ధి శిక్షణా అధికారి తదితరులు పాల్గొన్నారు.